# మోదీ X మస్క్.. మధ్యలో గ్రోక్

- ప్రధానిని 'పీఆర్ మెషీన్'గా అభివర్ణించిన ఏఐ టూల్
- నిర్భయంగా సమాధానమిచ్చిందని నెటిజన్ల ప్రశంసలు
- గ్రోక్‌పై విచారణకు కేంద్రం ఆదేశం..కేంద్రంపై ఎక్స్ దావా

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' ప్రధాని మోదీపై చేసిన కామెంట్లు భారత రాజకీయాల్లో సంచలనంగా మారాయి. ఇంకోవైపు యూజర్ల నుంచి ఫిర్యాదులు వచ్చాయని గ్రోక్ పనితీరుపై కేంద్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో ఈ వ్యవహారం 'మోదీ వర్సెస్ మస్క్'గా మారింది. ఇంకోవైపు ప్రభుత్వం కంటెంట్ నియంత్రణకు పాల్పడుతున్నదని ఎక్స్ సంస్థ కర్ణాటక హైకోర్టులో కేంద్రంపై దావా వేసింది. ఈ నేపథ్యంలో నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయారు. కొందరు గ్రోక్‌ను ప్రశంసిస్తుంటే, మరికొందరు విమర్శిస్తున్నారు. బీజేపీ నేతలు ఏకంగా 'గో బ్యాక్ గ్రోక్' నినాదాన్ని మొదలు పెట్టారు. తాజాగా ప్రధానిపై గ్రోక్ చేసిన కామెంట్లతో ఈ అగ్గి రాజుకున్నది. 2014 తర్వాత ప్రధాని మోదీ పెద్దగా ప్రెస్ కాన్ఫరెన్స్‌లకు హాజరు కాకపోవడంపై విశ్లేషించాలని ఓ నెటిజన్ గ్రోక్‌ను కోరారు. దీనికి గ్రోక్ స్పందిస్తూ మోదీని 'పీఆర్ మెషీన్'గా (ప్రచార యంత్రం) పేర్కొన్నది. 2014 తర్వాత ప్రధాని మోదీ ఒక్కసారి మాత్రమే 2019లో ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారని పేర్కొన్నది. అన్ని అంశాలపై మాట్లాడే బాధ్యతను కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు అప్పగించారంటూ ఎద్దేవా చేసింది.

**రెండుగా విడిపోయిన నెటిజన్లు**

గ్రోక్ అభిప్రాయాలపై నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయారు. కొందరు నెటిజన్లు గ్రోక్‌ను అభినందిస్తున్నారు. ఇది సూటిగా, నిర్భయంగా సమాధానాలు ఇస్తుందని కొందరు ప్రశంసిస్తున్నారు.మరికొందరు మాత్రం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న సమాచారాన్ని మాత్రమే విశ్లేషించి, తన అభిప్రాయం చెప్పిందంటూ వ్యాఖ్యానిస్తున్నారు. గ్రోక్‌ను షట్ డౌన్ చేయాలని మండిపడుతున్నారు.

**కేంద్రం ఎలా నిర్ణయిస్తుంది?**

గ్రోక్ వ్యవహారం కేంద్రం వర్సెస్ ఎక్స్‌గా మారింది. ఇటీవల ఓ వ్యక్తి గ్రోక్‌ను అడిగిన ప్రశ్నకు హిందీలో సమాధానం ఇచ్చింది. అయితే ఇందులో కొన్ని అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినట్టు కేంద్రం గుర్తించింది. దీంతో ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ఐటీ శాఖ ఎక్స్‌ను అడిగింది. మరోవైపు ప్రధానిపై గ్రోక్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నిరసనలు తెలుపుతున్నది. 'గ్రోక్ గో బ్యాక్' అంటూ తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. సోషల్ మీడియాలో సైతం బీజేపీ కార్యకర్తలు, సానుభూతిపరులు గ్రోక్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వంపై ఎక్స్ సంస్థ కర్ణాటక హైకోర్టులో కేసు వేసింది. కేంద్ర ప్రభుత్వం ఐటీ యాక్ట్ సెక్షన్ 79(3)(బీ)ని సాకుగా చూపుతూ ఎక్స్‌లో ఉన్న సమాచారాన్ని తొలగించాలని ఆదేశాలు జారీ చేస్తున్నదని తెలిపింది. ఇది సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన 'ఆన్‌లైన్‌లో భావ స్వేచ్ఛా ప్రకటన' తీర్పునకు వ్యతిరేకమని వాదించింది. కేంద్రం ఈ సెక్షన్‌ను వాడుకొని ఎక్స్‌లో ఏ సమాచారం ఉండాలో, ఏది తీసేయాలో నిర్ణయిస్తున్నదని ఆరోపించింది. ఎక్స్‌లో ఉన్న సమాచారాన్ని బ్లాక్ చేయిస్తున్నదని విమర్శించారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కోర్టు ఆదేశాలు ఉంటే మాత్రమే సోషల్ మీడియా సంస్థలు తమ వేదికల్లోని సమాచారాన్ని బ్లాక్ చేస్తున్నదని విమర్శించింది. తమ కంటెంట్‌పై నిర్ణయం తీసుకునే హక్కు కేంద్ర ప్రభుత్వానికి లేదని ఎక్స్ వాదించింది. దీంతో ఈ వ్యవహారం ఇంతటితో ముగియదని, భవిష్యత్తులో మరింత చర్చకు దారి తీయొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.



గ్రోక్‌పై అన్నామలై నిరసన



# కేసీఆరే ఉత్తమ సీఎం

**2028లో 87 సీట్లలో బీఆర్ఎస్ గెలుపు పక్కా అన్న 'గ్రోక్'**

**ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగితే ఇంకా బలపడవచ్చు | కాంగ్రెస్ పాలనపై ప్రజాభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టిన గ్రోక్**

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కూడా పసిగట్టింది. 2028లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 87 సీట్లలో గెలవవచ్చని ఎక్స్ (ట్విట్టర్)కు చెందిన ఏఐ టూల్ 'గ్రోక్' స్పష్టం చేసింది. కేసీఆర్ పాలనతో రేవంత్ రెడ్డి పనితీరును ప్రజలు పోల్చుకుంటున్నారని, భవిష్యత్తులో బీఆర్ఎస్‌కే పట్టం కడతారని స్పష్టం చేసింది. 2028లో బీఆర్ఎస్ పార్టీ ఎన్ని అసెంబ్లీ సీట్లు గెలుస్తుంది? అని ఓ నెటిజన్ గ్రోక్‌ను అడగగా.. '2025 మార్చిలో నిర్వహించిన సర్వే ప్రకారం.. ప్రస్తుత ట్రెండ్ కొనసాగితే బీఆర్ఎస్ 87 సీట్లు గెలవవచ్చు. కాంగ్రెస్‌పై అసంతృప్తి పెరిగితే బీఆర్ఎస్ బలపడవచ్చు' అని సమాధానం ఇచ్చింది.




ప్రస్తుత పరిణామాలను బట్టి భవిష్యత్తులో ఏం జరగవచ్చో ఏఐ అంచనా వేస్తుంది. వికీపీడియా ఆర్టికల్స్ నుంచి సైంటిఫిక్ పేపర్స్ వరకు మొత్తం సమాచారాన్ని ఇంటర్నెట్ నుంచి సేకరించి సమగ్రంగా సమాధానాలు ఇచ్చేలా ఏఐ చాట్‌బాట్ అయిన గ్రోక్‌కు శిక్షణ ఇచ్చారు. ఎక్స్‌లో వచ్చే పోస్టలన్నీ గ్రోక్‌కు డైరెక్ట్ యాక్సెస్ ఉంటుంది. అందువల్ల గ్రోక్ ఎప్పటికప్పుడు ప్రపంచ పరిజ్ఞానాన్ని తెలుసుకోగలుగుతుంది. 2028 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కూడా గ్రోక్ ఇలాంటి విశ్లేషణ జరిపిన తర్వాతే అంచనా వేసిందని టెక్నాలజీ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

**ప్రభుత్వంపై అసంతృప్తికి నిదర్శనం..**

తెలంగాణ భవిష్యత్తు రాజకీయాలపై గ్రోక్ వేసిన అంచనాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనమని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు. అలవిగాని హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చిన తర్వాత మొండి చేయి చూపడంపై ఆన్‌లైన్ వేదికగా విస్తృతంగా చర్చ జరుగుతున్నది. మీడియా, సోషల్ మీడియాలో ప్రభుత్వ వైఖరిని తూర్పార పడుతున్నారు. ప్రభుత్వ మోసంపై పోస్టులు, వీడియోల రూపంలో తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కుతున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ అసమర్థ, అసంబద్ధ నిర్ణయాలతో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు వైరల్ అవుతున్నాయి. ఇందుకు హైడ్రా కూల్చివేతలు ప్రత్యక్ష ఉదాహరణ. హైడ్రా బాధితుల కన్నీటి గాథల ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయి. ఇదే తరహాలో రైతుల ఆత్మహత్యలు, సాగునీటి నిర్వహణలో అసమర్థత, భూగర్భ జలాలు అడుగంటడం, పంటలు ఎండిపోవడం.. ఇలా ప్రతి అంశం పట్ల నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. దీంతోపాటు సీఎం రేవంత్ రెడ్డి తరచూ చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు అంతటా తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి. మంత్రుల వ్యవహారశైలి, విచ్చలవిడి అవినీతిపై పెద్ద ఎత్తున ఆన్‌లైన్‌లో చర్చ జరుగుతున్నది. పరిశ్రమల కోసమంటూ రైతుల భూములు బలవంతంగా గుంజుకోవడం, ప్రభుత్వంపై రైతులు తిరగబడటం, ప్రతీకారంగా రైతులపై ప్రభుత్వం దాష్టీకం, లగచర్ల వంటి ఉదాహరణలను గ్రోక్ స్పష్టంగా విశ్లేషించినట్టు చెప్తున్నారు. ప్రధాన మీడియాలో కొన్నింటిని నయానో, భయానో కాంగ్రెస్ ప్రభుత్వం తమకు అనుకూలంగా మార్చుకున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కానీ సోషల్ మీడియాలో నెటిజన్లు మాత్రం ప్రభుత్వాన్ని తూర్పారబడుతున్నారు. వీటన్నింటినీ గ్రోక్ గమనిస్తూనే ఉన్నదని చెప్తున్నారు. దీనికితోడు అధికార, ప్రతిపక్ష పార్టీలు నిర్వహిస్తున్న సర్వేలు, వాటి ఫలితాలను కూడా గ్రోక్ విశ్లేషిస్తున్నదన్నారు.

**కేసీఆర్ పాలన భేష్..**

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పనితీరు మరోమారు సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. కేసీఆర్ దార్శనికత, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలిపిన తీరును తాజాగా సోషల్ మీడియాలో 'గ్రోక్' నిగ్గుతేల్చింది. 2014-24 వరకు దేశంలో అత్యుత్తమ సీఎం ఎవరని ఓ నెటిజన్ 'ఎక్స్' అనుసంధానంగా పనిచేస్తున్న ఏఐ టూల్ 'గ్రోక్'ని ప్రశ్నించాడు. దానికి గ్రోక్ బదులిస్తూ.. కే చంద్రశేఖర్‌రావు దేశంలో అత్యుత్తమ సీఎం అని బదులిచ్చింది. ఇందుకు కారణాలను సవివరంగా వెల్లడించింది. కేసీఆర్ హయాంలో వార్షిక జీఎస్‌డీపీ 10-12 శాతం పెరిగిందని, మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డీఐ) ప్రకారం మౌలిక సదుపాయాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపింది. కేసీఆర్ ఆర్థిక విధానాలు అద్భుతమని కొనియాడింది. ఈ సమాధానికి మరో 'ఎక్స్' వినియోగదారుడు స్పందిస్తూ.. ఇండియా టెక్ అండ్ ఇన్ఫ్రా.. ఆర్బీఐ వెల్లడించిన 'భారత రాష్ట్రాల గణాంకాల హ్యాండ్ బుక్'ను షేర్ చేశాడు. ఇందులో 2017-18 నుంచి 2022-23 వరకు నెట్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్(ఎన్ఎస్‌డీపీ)లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ 28.52 శాతం అగ్రస్థానంలో ఉండగా.. తమిళనాడు 25.22, కర్ణాటక 25.32 శాతాలతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మరోవైపు కాంగ్రెస్ అధికారంలో వచ్చిన నాటినుంచి తీసుకుంటున్న ఆర్థిక విధానాలతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అగమాగం అయింది. ఈ అంశంపై 'ఎక్స్' వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ.. ఎవరు ఏమన్నా.. కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశంలోనే అత్యుత్తమ పనితీరు కనబర్చిన రాష్ట్రం అని పేర్కొన్నారు.

**మళ్లీ బీఆర్ఎస్‌వైపే..**

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతో విసుగెత్తిపోతున్న ప్రజలు బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపుతున్నారని గ్రోక్ స్పష్టంగా తెలిపింది. నెటిజన్లు రేవంత్ రెడ్డి పాలనను కేసీఆర్ పాలనతో పోల్చుకొని, మరోసారి కేసీఆర్‌కే జై కొడుతున్నట్టు ఈ సమాధానం స్పష్టం చేస్తున్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్ సర్వేల్లోనూ బీఆర్ఎస్‌కే జై కొడుతున్నారని అర్థమవుతున్నదన్నారు. బీజేపీ కాస్త హడావుడి చేస్తున్నా.. రాష్ట్రంలో ఎప్పటికైనా బీఆర్ఎస్ వైపే ప్రజలు మొగ్గు చూపుతారనడానికి ఇదే నిదర్శనమని పేర్కొంటున్నారు.



# సంతోషంలో మనం వెనుకే!

- ప్రజా జీవన సంతోషంలో భారత్‌కు 118వ ర్యాంక్
- తొలి స్థానంలో ఫిన్లాండ్

న్యూఢిల్లీ: ప్రజా జీవనం సంతోషకరంగా సాగుతున్న దేశాల జాబితాలో భారత దేశం అట్టడుగున ఉన్నది. 147 దేశాల పరిస్థితులను అధ్యయనం చేసి, గురువారం విడుదల చేసిన ఈ నివేదికలో భారత్ 118వ స్థానంలో ఉంది. ప్రపంచంలో అత్యంత సంతోషకరమైన దేశంగా ఫిన్‌ల్యాండ్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ దేశం వరుసగా ఎనిమిదేండ్ల నుంచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంటున్నది. రెండు, మూడు స్థానాల్లో వరుసగా డెన్మార్క్, ఐస్‌ల్యాండ్ ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో స్వీడన్ (4), నెదర్లాండ్స్ (5) ఉన్నాయి. విశ్వాసం, ఆత్మ సంతృప్తి, సామాజిక మద్దతు, స్వేచ్ఛ, దాతృత్వం, అవినీతి వంటి అంశాలను పరిశీలించి ఈ ఆయా దేశాలకు ర్యాంకులిచ్చారు. ఏటా మార్చి 20న ప్రపంచ సంతోష దినాన్ని నిర్వహించాలని ఐక్య రాజ్య సమితి 2012లో ప్రకటించింది.

# గాజాపై మళ్లీ భీకర దాడి


**70 మంది మృతి**

జెరూసలేం: ఇజ్రాయెల్-హమాస్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడుల్లో 400మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తాజాగా టెల్‌అవీవ్ దళాలు మరోసారి గురువారం వైమానిక దాడులతో విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో దాదాపు 70 మంది ప్రాణాలు కోల్పోయినట్టు స్థానిక అధికారులు తెలిపారు. ఇందులో ఓ మహిళతో సహా అనేక మంది చిన్నారులు ఉన్నట్టు వెల్లడించారు. బందీలందరినీ విడుదల చేయడానికి ఇదే చివరి అవకాశమని ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ గాజాకు హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు..నెట్జారిమ్ టెల్‌అవీవ్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి బందీల ప్రాణాలను ప్రమాదంలో పడేసిందని పేర్కొన్నది. ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

# కర్ణాటక ప్రజలకు కాంగ్రెస్ కరెంట్ షాక్!

**యూనిట్‌కు 36 పైసల చొప్పున సర్‌చార్జి వడ్డన**

బెంగళూరు, మార్చి 20: కర్ణాటకలో విద్యుత్తు వినియోగదారులపై భారం పడనున్నది. ఏప్రిల్ 1 నుంచి ప్రతి యూనిట్‌కు అదనంగా 36 పైసల చొప్పున సర్‌చార్జి చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రభుత్వం చెల్లించాల్సిన పెన్షన్, గ్రాట్యుటీ(పీ అండ్ జీ) వాటాను విద్యుత్తు వినియోగదారుల నుంచి రాబట్టాలని విద్యుత్తు సరఫరా కంపెనీలను(ఎస్కామ్స్) కర్ణాటక విద్యుత్తు నియంత్రణ కమిషన్(కేఈఆర్‌సీ) ఆదేశించిన దరిమిలా ఈ నిర్ణయం వెలువడింది. 2026-27. 2027-28 ఆర్థిక సంవత్సరంలో పీ అండ్ జీ సవరించనున్నారు. వినియోగదారులు వరుసగా 35 పైసలు, 34 పైసలు ప్రతి యూనిట్‌కు చెల్లించాల్సి ఉంటుంది. విద్యుత్ వినియోగదారులపై పడనున్న అదనపు భారంపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర విమర్శించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పాలన వచ్చిన నాటి నుంచి ధరల పెంపు తప్ప మరో గ్యారెంటీ ఏదీ అమలు చేయలేదని ఆయన ఆరోపించారు.



**రెట్టింపు కానున్న ఎమ్మెల్యేల జీతభత్యాలు**

ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్న కర్ణాటకలో ముఖ్యమంత్రి నుంచి శాసనసభ్యుల వరకు అందరి జీతాలు రెట్టింపు కానున్నాయి. ఇందుకు సంబంధించిన బిల్లును శుక్రవారం రాష్ట్ర శాసనసభ ఆమోదించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు అసెంబ్లీ స్పీకర్, ప్రతిపక్ష నాయకుడి జీతాలు, అలవెన్సులు, పింఛన్లు పెరగనున్నాయి. ధరల పెరుగుదలతో సామాన్యుడు ఏ విధంగా సమస్యలను ఎదుర్కొంటున్నాడో తమ పరిస్థితి కూడా అంతేనని కర్ణాటక హెం మంత్రి జీ పరమేశ్వర జీతాల పెంపు ప్రతిపాదనను సమర్థించుకున్నారు. జీతాల పెంపు ప్రతిపాదనలు ఎమ్మెల్యేల నుంచి వచ్చాయని, దీనిపై ముఖ్యమంత్రి తుది నిర్ణయం తీసుకున్నారని ఆయన చెప్పారు. అందరూ బతకాల్సిందేనంటూ పరమేశ్వర వ్యాఖ్యానించారు.

# టీ-షర్టులతో సభలోకా?

**నిబంధనలకు విరుద్ధమన్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా**

**ఒప్పుకోకుండా నినాదాలు చేసిన డీఎంకే ఎంపీలు**

న్యూఢిల్లీ, మార్చి 20: నియోజవకర్గాల పునర్విభజన ప్రక్రియపై నిరసన వ్యక్తం చేస్తూ టీ-షర్టలతో సభకు వచ్చిన డీఎంకే సభ్యులపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అసహనం వ్యక్తం చేశారు. అలా రావడం నిబంధనలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. వెంటనే బయటకు వెళ్లి సరైన దుస్తులు ధరించి వచ్చి సభా గౌరవాన్ని కాపాడాలని కోరారు. నియోజక వర్గాల పునర్విభజనపై చర్చ జరపాలన్న డీఎంకే సభ్యులు డిమాండ్‌ను ఆయన తిరస్కరించారు. డీఎంకే ఎంపీలు 'న్యాయబద్ధంగా పునర్విభజన కావాలి, తమిళనాడు పోరాడుతుంది.. విజయం సాధిస్తుంది' అన్న నినాదాలున్న టీ షర్టులు ధరించి ఉభయ సభలకు హాజరయ్యారు. డీఎంకే ఎంపీలు డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. రాజ్యసభలోను అదే పరిస్థితి కన్పించింది.




**సభ్యులకు డ్రెస్ కోడ్ లేదు**

అంతకుముందు కొందరు సభ్యులతో సమావేశమైన రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ ఎంపీలు తమకు సహకరించాలని కోరారు.



# హనీ ట్రాప్‌లో 48 మంది నేతలు!

బెంగళూరు, మార్చి 20: కేంద్ర మంత్రులతో సహా దాదాపు 48 మంది రాజకీయ నాయకులు హనీ ట్రాప్‌లో చిక్కుకున్నట్టు కర్ణాటక సహకార శాఖ మంత్రి రాజన్న గురువారం రాష్ట్ర అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సమస్య ఏ ఒక్క రాజకీయ పార్టీకో పరిమితం కాదని, దీనిపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరగాలని ఆయన డిమాండ్ చేశారు. హనీ ట్రాపింగ్ ప్రక్రియ ఎలా జరుగుతుందో ఆయన వివరిస్తూ వాట్సాప్‌లో వీడియో కాల్ లేదా మెసేజ్ వస్తుందని ఆయన చెప్పారు. గడచిన ఆరు నెలలుగా రాష్ట్రంలోని రాజకీయ నాయకులపై హనీ ట్రాప్ జరుగుతోందని ఆయన తెలిపారు. తుమకూరుకు చెందిన ఇద్దరు మంత్రులు హనీ ట్రాప్‌లో చిక్కుకున్నట్టు పత్రికలలో వార్తలు వచ్చాయని, తాను, హోం మంత్రి పరమేశ్వర మాత్రమే తుమకూరుకు చెందిన మంత్రులమని రాజన్న తెలిపారు. హనీట్రాప్‌పై తాను హోం మంత్రికి లిఖిత పూర్వక ఫిర్యాదు చేసి దర్యాప్తు కోరినట్టు తెలిపారు. మంత్రి రాజన్న కుమారుడు, ఎమ్మెల్సీ రాజేంద్ర శాసన మండలిలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. మరో మంత్రి సతీశ్ జార్ఖిహోళి కూడాహనీ ట్రాప్ గురించి ప్రస్తావించారు.

# రక్తమోడిన దండకారణ్యం

**ఛత్తీస్‌గఢ్‌లో రెండు భారీ ఎన్‌కౌంటర్లు**

**30 మంది నక్సల్స్.. ఒక జవాన్ మృతి**

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 20: తుపాకుల మోతతో దండకారణ్యం రక్తసిక్తమైంది. మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య గురువారం జరిగిన రెండు వేర్వేరు ఎదురుకాల్పుల్లో 30 మంది మావోయిస్టులు, ఒక జవాన్ మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. బీజాపూర్ జిల్లా పీడియా అడవుల్లో గురువారం ఉదయం నక్సల్స్, పోలీస్ వర్గాల మధ్య సుమారు నాలుగు గంటలపాటు భీకర పోరు సాగింది.



ఘటనా స్థలం నుంచి 26 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కాంకేర్-నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దు కోరోస్‌కోడో గ్రామ సమీప అడవుల్లో జరిగిన మరో ఎదురుకాల్పుల్లో నలుగురు మావోలు మృతి చెందారు. 'మోదీ సర్కార్ మావోయిజాన్ని తుదముట్టించడమే లక్ష్యంగా కఠినమైన చర్యలు తీసుకుంటుంది. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశం నక్సల్స్ రహితంగా మారుతుంది' అంటూ హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు.

# దిశపై సామూహిక రేప్!

**శివసేన ఎమ్మెల్యే ఆదిత్య ఠాకరేపై కేసు ఫైల్ చేయండి**

**హైకోర్టులో సుశాంత్ మాజీ మేనేజర్ తండ్రి పిటిషన్**



ముంబై (నమస్తే తెలంగాణ): నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియాన్‌పై లైంగిక దాడి జరిందని, ఆమె మరణించిన ఐదేండ్ల తర్వాత ఆమె తండ్రి సంచలన ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించి శివసేన(యూబీటీ) ఎమ్మెల్యే ఆదిత్య ఠాకరేపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బాంబే హైకోర్టును గురువారం ఆశ్రయించారు. అయితే తనను అప్రతిష్ట పాల్జేయడానికి బీజేపీ ప్రభుత్వం ఈ కుయుక్తులకు పాల్పడుతోందని, తన వాదనను కోర్టులో వినిపిస్తానని ఆదిత్య వెల్లడించారు. ముంబైలో శివార్లలోని ఓ భవనం 14వ అంతస్తు పైనుంచి పడి 2020 జూన్ 8న దిశా సాలియాన్ మరణించారు. పోలీసులు దీన్ని ప్రమాదవశాత్తు సంభవించిన మరణంగా(ఏడీఆర్)గా కేసు నమోదు చేశారు. ఇది జరిగిన ఆరు రోజుల తర్వాత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ బాంద్రాలోని తన ఫ్లాట్‌లో శవమై కనిపించారు.తన కుమార్తె మరణంపై తనకు ఎలాంటి అనుమానాలు లేవని, దర్యాప్తు పట్ల తనకు పూర్తి సంతృప్తిగా ఉందని 2020లో సతీష్ సాలియాన్ పోలీసులకు తెలిపారు. కాగా, తాజా పిటిషన్‌లో ఆయన అనేక సంచలనాత్మక ఆరోపణలు చేశారు. తన కుమార్తెపై రేప్ జరిగిందని, ఆ తర్వాత ఆమెను చంపివేశారని సాక్షుల కథనాలను ఉటంకిస్తూ ఆయన ఆరోపించారు. 14వ అంతస్తు నుంచి పడిపోయి మరణించిందని చెబుతున్న తన కూతురి శరీరంపై ఒక్క ఫ్రాక్చర్ కూడా లేదని, ఆమె కింద పడిన ప్రదేశంలో రక్తం కూడా లేదని పిటిషన్‌లో ఆయన తెలిపారు. ఈ నేరంలో ప్రధాన నిందితుడు ఆదిత్య ఠాకరే అని ఆయన ఆరోపించారు.


# రాడ్‌తో చంపి.. గోనె సంచిలో కుక్కి..

**ప్రియుడి బైక్‌పై భర్త శవం తరలింపు**

జైపూర్: యూపీలో నేవీ మర్చంట్ అధికారిని అతడి భార్య ముక్కలు చేసిన ఘటన మరువక ముందే వివాహేతర సంబంధం కోసం కట్టుకున్న భర్తను కడతేర్చిన మరో భార్య ఉదంతం జైపూర్‌లో వెలుగు చూసింది. ధన్నాలాల్ అనే వ్యక్తికి గోపాలి దేవితో వివాహమైంది. అయితే ఆమె ప్రియుడు దీన్‌దయాల్‌తో వివాహేతర సంబంధం సాగిస్తుండేది. అయితే భార్య ప్రవర్తనపై అనుమానంతో ఆరా తీయగా, ప్రియుడు దీన్‌దయాల్‌తో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడింది. దీనిపై ప్రశ్నించిన అతడిపై వీరిద్దరూ రాడ్‌తో దాడి చేసి హత మార్చారు. అనంతరం ధన్నాలాల్ మృతదేహాన్ని గోనెసంచిలో ఉంచిన గోపాలిదేవి.. ప్రియుడి బైక్‌పై దానిని పట్టపగలు నిర్జన ప్రదేశంలోకి తరలించారు. రోడ్డు పక్కన మృతదేహాన్ని దహనం చేస్తుండగా, ఎవరో రావడంతో పరారై తర్వాత పట్టుబడ్డారు.

# హెచ్-1బీ పాత రికార్డులు ఉండవిక

- వీసాల ప్రోగ్రామ్‌లో కీలక మార్పులు చేస్తున్న ట్రంప్
- ఐదేండ్ల పాత రికార్డుల తొలగింపునకు నిర్ణయం
- డౌన్‌లోడ్ చేసుకోకుంటే కోల్పోతారని వెల్లడి



వాషింగ్టన్, మార్చి 20: వలస విధానాలను సమూలంగా మార్చేయాలనుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బీ వీసాల జారీలో కీలక మార్పులు చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా వీసా జారీ ప్రక్రియ కోసం సరికొత్త వ్యవస్థను అమలుజేసేందుకు సిద్ధమయ్యారు. మార్చి 20 నుంచి వీసా దరఖాస్తులను పరిశీలించే ఫారిన్ లేబర్ యాక్సెస్ గేట్‌వే వీసా వ్యవస్థలో పాత రికార్డులు, దరఖాస్తులను తొలగించనుంది. దీంతో హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌లో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. తాజా ఆదేశాల ప్రకారం, మార్చి 20 నుంచి ఐదేండ్ల కంటే పాతవైన అన్ని రికార్డులను సిస్టమ్ నుంచి తొలగించనున్నారు. అంటే..ఉదాహరణకు ఓ దరఖాస్తుకు సంబంధించి ఉద్యోగులకు సంబంధించి ఐదు సంవత్సరాల కంటే పాతవైన వీసాల రికార్డులన్నింటినీ మార్చి 19లోగా డౌన్‌లోడ్ చేసి పెట్టుకోవాలని ఆయా సంస్థలను ఇప్పటికే ఆదేశించారు. లేదంటే ఆ రికార్డులను కోల్పోవాల్సి ఉంటుందని పేర్కొన్నది.

**హెచ్-1బీ సహా అన్నీ తాత్కాలికం**

లేబర్ కండిషన్ అప్లికేషన్స్, శాశ్వత లేబర్ సర్టిఫికెట్ అప్లికేషన్లపై ఈ తొలగింపు ప్రభావం పడనున్నదని ఆఫీస్ ఆఫ్ ఫారిన్ లేబర్ సర్టిఫికేషన్ విభాగం నోటీసులు జారీచేసింది. త్వరలోనే వీసాల జారీ కోసం యూఎస్ ఇమ్మిగ్రేషన్ విభాగం కొత్త దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించనున్నది. దరఖాస్తుదారులందరికీ మరింత పారదర్శకంగా సేవలందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ట్రంప్ సర్కార్ వెల్లడించింది. ఈ ఏడాది నుంచి హెచ్-1బీ వీసాల జారీలో అమెరికా కొత్త విధానాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇకపై ఒక లబ్దిదారు బహుళ దరఖాస్తులు చేసుకున్నా..ఒకే అప్లికేషన్‌గా పరిగణించనున్నారు. లాటరీ విధానంలో అనుచిత ప్రయోజనం పొందకుండా అడ్డుకునేందుకు తాజా నిబంధనలు తీసుకొచ్చారు.

**మూసివేత దిశగా అమెరికా విద్యాశాఖ!**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రద్దుల పద్దులో తాజాగా విద్యాశాఖ కూడా చేరింది. ఎన్నికల్లో చేసిన వాగ్దానంలో భాగంగా చిరకాలంగా ఎదురు చూస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ రద్దు కార్యనిర్వాహక ఉత్తర్వుపై డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయనున్నట్టు శ్వేత సౌధం వర్గాలు తెలియజేశాయని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. ఉదారవాద భావాలతో విద్యా శాఖ కలుషితమైందని ట్రంప్ గట్టిగా నమ్ముతున్నారు. దానికి తోడు వ్యయాల తగ్గింపులో భాగంగా దీనిని ఎట్టి పరిస్థితుల్లో రద్దు చేయాలని ఆయన కృతనిశ్చయంతో ఉన్నారు. అయితే ట్రంప్ ఈ ఉత్వర్వులపై సంతకం చేయకుండానే దీనిని సవాల్ చేస్తూ డెమోక్రాట్లు అధికారంలో ఉన్న స్టేట్ అటార్నీ జనరల్స్ న్యాయస్థానాలను ఆశ్రయించారు..

**సాధ్యమేనా?**

కాంగ్రెస్ అనుమతి లేకుండా ట్రంప్ ఈ శాఖను మూసివేయలేరని, అది కష్టసాధ్యమని కొందరు పేర్కొంటున్నారు. ఎందుకంటే సెనేట్‌లో రిపబ్లికన్‌లకు 53-47 ఆధిక్యత ఉంది. అయితే కేబినెట్ స్థాయి సంస్థను తొలగించాలంటే కనీసం 60 ఓట్లు ఉండాలి. అయితే ఇక్కడ రిపబ్లికన్‌లకు మెజారిటీ ఉండదు. 7 ఓట్లు తగ్గుతాయి.